
'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

-తిమ్మన శ్యామ్‌సుందర్



# డోలి

పట్టపగలు చిమ్మచీకటెలా ఉంటుందో చూపిస్తామన్నట్లు ముసురుకుంటున్నాయి మబ్బులు. తమ రౌద్రానికి పరాకాష్ట ఈ అత్యవసర సమావేశమన్నట్లు ఆకాశమంతా హడావిడిగా పరుచుకుంటున్నాయి. కరిగిన మా విశ్వరూపాన్ని మరి కాసేపట్లో మీకు చూపిస్తామన్నట్లు మధ్యమధ్యలో ఉరిమి చూస్తున్నాయవి.

లాన్‌లో కూర్చుని టీ సిప్ చేస్తున్న శేఖర్ ''వర్షం పడేట్లుంది లోపలకి వచ్చెయ్యండి'' అన్న సునంద పిలుపుకి ఏమాత్రం స్పందించలేదు. ఇది పడే వర్షం కాదులే అన్నట్లు చూసాడామెవైపు.

''ఎన్నాళ్ళయ్యింది వర్షాన్ని చూసి?...'' అనుకున్నాడు.

ఒకప్పుడు కాలానికి అనుగుణంగా ఋతుపవనాలు వచ్చేవి. ఋతు పవనాలకు అనుగుణంగా కాలమూ నడిచేది. కాని నేడు మనుషుల్లాగా ఎవరిదారి వారిదే అన్నట్లు వాటి దారీ వాటిదే అయ్యింది. భూగర్భ జలాలు అడుగంటిన లోకంలోకి వచ్చి నేను మాత్రం ఏం చెయ్యనంటూ గర్భస్థ శిశువుకూడా మొండికేస్తున్నాడు. అందుకేనేమో వాడు నార్మల్‌గా బైటికి రాడని సిజేరియన్ల ద్వారా బలవంతంగా బైటికి రప్పిస్తున్నారు.

''వర్షం కురిస్తే చిన్న పిల్లాడిలా తడుస్తూ ఆడుకోవాలనుంది. కాని ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ రాదు. ఒకవేళ వస్తే దాన్ని వీడియో షూట్ చేసి భద్రపరుచుకోవడం ఉత్తమం ఎందుకంటే వర్షమంటే ఇలా ఉంటుందని భావితరాలకు ఆ క్యాసెట్‌ని చూపించాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితి వచ్చినా రావొచ్చు...'' అనుకుంటూ టీ కప్పుని టీపాయ్ మీద పెడుతుండగా ''కంగ్రాచులేషన్స్''అని వినపడ్డంతో తల తిప్పి చూసాడు.

చంద్రం. తన ప్రాణ స్నేహితుడు.

అతని అభినందనలోని అసహనాన్ని గమనించి ''అవార్డ్‌ని తిరస్కరించినందుకు కోపంగా ఉందా?'' అనడిగాడు చిన్నగా నవ్వుతూ.

''ఉండదా మరి? ఎంతో మంది ఫారెస్టాఫీసర్లుండగా ఆ జాతీయ అవార్డు నీకే రావడమంటే సామాన్యమైన విషయమనుకుంటున్నావా? దాన్నెందుకు కాదన్నావ్?'' కాస్త కటువుగా అడిగాడతను.

కుర్చీలోనుంచి లేచి, స్నేహితుడి భుజం మీద చెయ్యేసి నొక్కుతూ శేఖర్ ''ఉద్యోగ బాధ్యతను అత్యుత్తమంగా నిర్వహించినందుకు ప్రభుత్వం నాకీ అవార్డుని ప్రకటించుండొచ్చు. కానీ నా బాధ్యత వెనక నా స్వార్థముంది. అంతకుమించి ఓ అద్భుతమైన ప్రేమ కావ్యముంది...''

తనకత్యంత ప్రీతిపాత్రమైన ఆ లాన్‌లోకి మొక్కల సాక్షిగా ఆ అవార్డుకి కారణమైన నేపథ్యం మరోమారు అతనిముందు సాక్షాత్కరించింది.

★★★

''జాగర్త దొరా! సూసి అడుగెయ్యండి. అడవి బోయినా రాళ్ళూ, మోళ్ళూ కాళ్ళని నమిలేత్తయ్!...''

పసిపిల్లాడి చేతులు పట్టుకుని కొత్తగా అడుగులు నేర్పిస్తున్నట్లు శేఖర్ చేతిని గట్టిగా పట్టుకుని ఎదురుదెబ్బలు తగలకుండా ఎంతో జాగ్రత్తగా తీసుకెళ్తూ అన్నాడు భూమయ్య ఆ అడవిలో.

ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో చేరాక అతనికిది మూడో ట్రాన్స్‌ఫర్. గతంలో పనిచేసిన రెండుచోట్లా అతను ఇటువంటి ఇబ్బంది పడలేదు. ఎంత దూరం నడిచినా రాళ్ళు, గుట్టలు తప్ప కనుచూపుమేరలో ఒక్క చెట్టుకూడా కనిపించకపోవడంతో ''చెట్టూపుట్టా లేని ఈ అడవికి నేను అధికారినా?'' అనుకున్నాడు విస్మయంగా.

''అసలిది అడవేనా?...'' మనసులో అనుకోబోయి పైకే అనేసాడు.

''ఔ! నరికేత్తే అడివిబోద్ది, కొండలూ కరుగుతయ్. అంది నట్టుకి అందరూ పంచకుంద్రు. ఎవుడికి దొరికిందాడు ఎల్ల మార్చుకుంటే ఏమ్మిగిలేను?...'' అన్న భూమయ్య ప్రతిస్పందనలోని ఆవేదనను వెంటనే గ్రహించాడు శేఖర్.

మరో నాలుగడుగులేసాక దగ్గర్లో ఉన్న పొదలో శబ్దం రావడంతో ఉలిక్కిపడి ''ఈ అడవిలో క్రూర మృగాలేమైనా ఉన్నాయా?'' అనడిగాడు.

ఫెళ్ళున నవ్వాడు భూమయ్య.

''భలే అడిగిండ్రు. అడివే లేందే జీవాలేడుండేను?...'' అని చేతి కర్రతో పొదలో కదిలించి చూసాడు.

తన జీవితంలో అంతకు ముందెన్నడూ సంభవించని ఓ అద్భుత సంఘటనకు అది శ్రీకారం చుడుతుందని ఏమాత్రం ఊహించని శేఖర్ చేష్టలుడిగి నిలుచుండిపోయాడు పొదలోనుండి బైటికొచ్చిన ఆ మెరుపుతీగను చూసి.

''ఓసి డోలీ! నువ్వటే? ఏం సేత్తున్నావీడ?...'' భూమయ్య అడిగాడామెని.

''పరిగేర్తండా మావా? ఈయనోరు?'' అనడిగింది శేఖర్‌కేసి చూస్తూ.

ఆ ఒక్క చూపుకే తననితాను మరచిపోయాడు శేఖర్. ''ఓ సృష్టికర్తా! అద్భుత లావణ్యవతిని సృష్టించి ఆమె అందాన్ని ఇలా అడవి కాచిన వెన్నెల కమ్మని శపించావా? నీ సృష్టిని చూసి నీకే కన్నుకుట్టిందటయ్యా?'' అని కసిదీరా తిట్టుకున్నాడు విధాతని.

''కూనది మా గూడెమే దొరా! నాగన్న కూతురు. పేరు డోలి!...''

విరబుచ్చిన గంధపు చెట్టులాంటి ఆమె కళ్ళముందు కదలాడుతుంటే ఆ రాత్రి నిద్రపట్టలేదు శేఖర్‌కి.

ఆ రాత్రే కాదు అలా ఎన్నో రాత్రులు డోలికి దగ్గరవ్వడమెలా అని ఆలోచిస్తూ నిద్రని దూరంచేసుకుంటూ గడిపాడు.

కొత్త ఫారెస్ట్ ఆఫీసర్‌గా ఛార్జ్ తీసుకున్నా విధులు నిర్వహించేందుకు మనసు సిద్ధపడకపోతుండడంతో డోలీని మరోసారి చూస్తే తప్ప మనసు తిరిగి స్వాధీనంలోకి రాదని భూమయ్యని తోడు తీసుకుని గూడేనికి బయల్దేరాడు.

ఎంతో సాదరంగా ఆహ్వానించాడు నాగన్న అతన్ని చూడగానే.

అతిథి మర్యాదగా పుట్టతేనె పట్టుకొచ్చిన డోలి అమృతాన్ని అందించేందుకు సాక్షాత్కరించిన జగన్మోహినిలా కన్పించిందతనికి.

అడవి తేనె తనకి కొత్త కాకపోయినా ఈసారి మాత్రం దాన్లో కొత్త రుచిని ఆస్వాదించాడతను.

గూడెంలో అందరి పేర్లడిగి తెలుసుకున్నాడు. వాటిని తన డైరీలో రాసుకున్నాడు.

''దొరా తమరి పేరు కూడా సెబితే... గోడల మీద ఎట్టాగూ రాసుకోలేం. కనీసం గుండెల్లోనైనా పెట్టుకుందామని...'' అంటూ తన పేరడిగిన నాగన్న వంక ఆశ్చర్యంగా చూసి ''పేరు రాసుకోడానికి అభ్యంతరమేముంది?'' అనడిగాడు.

''రాయటం మాలో ఒక్కడికైనా సేతైతే కదా?...'' అని భూమయ్య వెంటనే బదులివ్వడంతో తన ఉద్యోగ బాధ్యతకంటే కూడా అతి ముఖ్యమైన కర్తవ్యం సాక్షాత్కరించిందతనికి. ''అడవి నిర్లక్ష్యానికి గురయ్యింది. ఆదివాసీలు కూడానా...?''

(9వ పేజీ తరువాయి)

"ఒక సంకల్పంకోసం ఇన్నాళ్ళూ పెళ్ళి పోస్ట్‌పోన్ చేస్కుంటూ వచ్చాను. డోలీ కోరుకున్న సంపదని ఇన్నాళ్ళకి వాళ్ళకి అందించగలిగాను కాబట్టి త్వరలోనే ఆమె దగ్గర ఆ ప్రస్తావన తీసుకొస్తాను... అంటుండగా "దొరబాబూ!..." అన్న పిలుపుకి అటు చూసాడు.

నాగన్న తన పరివారంతో వచ్చి "మీరీడున్నారా బాబూ? మీకోసం అడివంతా గాలించొత్తున్నా..." అన్నాడు అలసటగా కండువాతో మొహం తుడుచుకుంటూ.

అతని ప్రక్కన ఆధునిక నాగరికతకు సంకేతంలా నిలుచున్న డోలీని చూసి ఆశ్చర్యపోయాడు చంద్రం. పైగా ఆమె "బాగున్నారా చంద్రం బాబూ?..." అంటూ తనని పేరు పెట్టి మరీ పలకరించడంతో ఆమె జ్ఞాపకశక్తికి జోహార్లర్పించకుండా ఉండలేకపోయాడు.

కొండంత వెలుగుని కళ్ళల్లో నింపుకున్న నాగన్న "నీ దయవల్ల అడివి మారింది దొరా! మడుసులూ మారాం. జీవితంలో మళ్ళా వోనలు సూత్తాం అనుకోలా. కడుపు నిండా ఇంత ముద్ద తింటామనీ అనుకోలా. మీరొచ్చిన కాణ్ణుంచీ అన్ని అదృట్టాలూ మాకాడికే నడుత్తున్నాయ్. ఇక నడవాల్సింది ఎప్పుడో ఏళ్ళనాడు సేసుకున్న జాతర. వచ్చే పున్నమినాడే జాతర జరుపుకోవాలని అందరం ఓ మాట కొచ్చాం..." అనడంతో శేఖర్ గుండెలో కోటి కోయిల రాగాలు ఒకేసారి ప్రతిధ్వనించాయి.

"ఈరోజు కోసమేకదా ఇంతకాలం శ్రమించింది?..."

"జాతర రోజున అందరూ ఆనంద సంబరాన మునిగి తేలుతున్న సమయంలో డోలీని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నట్లు చెప్పెయ్యాలి..."

"అప్పుడు డోలి ఎంతలా ఆశ్చర్యపోతుందో? ఎంతగా సిగ్గుపడిపోతుందో??..."

"నా నోటినుంచి ఆ మాట వెలువడగానే ఆదివాసీలందరూ ఇంకెంత సంబరపడిపోతారో?..."

"మీరొస్తేనే మా జాతరకి అర్థం, పరమార్థం శేఖర్ బాబూ! ఈ జాతర మాకోసం చేసుకుంటున్నా మీవల్ల జరుపుకుంటున్నామని మాత్రం మరువొద్దు..." అన్న డోలీ అభ్యర్థనలో వేల వేల వసంతాలు సొంతం చేసుకున్నాడు శేఖర్.

★★★

పున్నమి వెన్నెల ముఖ్య అతిథిగా, కోట్లాది తారలు ఆహూతులుగా విచ్చేసినట్లు దేదీప్యమానంగా వెలిగిపోతుందాప్రాంతం. కొన్ని గూడేల జనాలు సంప్రదాయ గానాలు చేస్తుంటే మరి కొందరు విచిత్ర వేషధారణలతో, నృత్యాలతో గతంలో ఎన్నడూ పొందని ఆనందాన్ని సొంతం చేసుకుంటున్నారు.

తనకోసం ఏర్పాటుచేయబడ్డ ప్రత్యేకమైన ఆసనంలో కూర్చుని ఆ సంబరాల్ని ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నాడు శేఖర్. అతని ప్రక్కనే కూర్చుని ఆ వేడుకలను వివరించసాగాడు భూమయ్య.

"ఆ మూలకాడ ఒంటికాల్తో సిందు తొక్కుతున్నారు సూడండీ... దానర్థమేందంటే వోనలు బాగా పడి పంటలు ఇరగ్గాసినందుకు అమ్మోరికి సెప్పుకునే కృతగ్నతన్నమాట. ఈ రేయంతా అట్టా సిందుతొక్కుతూనే ఉంటారు వాళ్ళు. ఇదిగో... ఇటు సూడండి. నెత్తిమీద కుండలెత్తుకుని ఆడజన మెల్తుంది అమ్మోరికి నైవేద్దం పెట్టటానికి. ఆ నైవేద్దం ఎట్టా సేత్తారంటే...

అదేం తలకెక్కట్లేదు శేఖర్‌కి. అతని మది నిండా డోలీనే ఉండడంతో ఆమెకోసం వెంటాడుతున్న తన చూపులకి సర్దిచెప్పుకోలేకపోతున్నాడు. తన శరీరం తన అదుపు తప్పుతుండడంతో మరి ఆగలేక "డోలీ కనిపించదేం?..." అనడిగాడు కాస్తంత అసహనాన్ని ప్రదర్శిస్తూ.

"అదేంది బాబూ అట్టా అంటారు? ఇందాకాడోళ్ళతో అది కూడ కుండెత్తుకునెళ్ళింది సూళ్ళా?..." అని భూమయ్య అనడంతో బిత్తరపోయాడతను.

"ఔ! మొగానికి యేప పసరు రాసుకుందిగదా, గుర్తుపట్టుండరు..." అనగానే చంద్రం "డోలీ కూడా అందరిలాగా అలా పసరు రాసుకోవడమేంటి?" అనడిగాడు ఒకింత ఆశ్చర్యంగా.

దానికి భూమయ్య చిన్నగా నవ్వుతూ "కూన అచ్చరాలు నేర్చుకున్నంత మాత్రాన ఆశారం మారిపోద్దా?..."అనగానే తన తొందరపాటుకు నొచ్చుకున్నాడతను.

డోలీ కూడా అడవి జాతి స్త్రీలాగా వేషధారణ చేసుకుందని తెలిసి ఒకింత ఆశ్చర్యపడ్డా, ఆ స్త్రీలందరూ అమ్మోరికి



"నీ దయవల్ల అడివి మారింది దొరా! మడుసులూ మారాం. జీవితంలో మళ్ళా వోనలు సూత్తాం అనుకోలా. కడుపునిండా ఇంత ముద్ద తింటామనీ అనుకోలా. మీరొచ్చిన కాణ్ణుంచీ అన్ని అదృట్టాలూ మాకాడికే నడుత్తున్నాయ్. ఇక నడవాల్సింది ఎప్పడో ఏళ్ళనాడు సేసుకున్న జాతర. వచ్చే పున్నమినాడే జాతర జరుపుకోవాలని అందరం ఓ మాటకొచ్చాం..."

నైవేద్యం పెట్టి తిరిగొస్తుండడంతో ఆమెను గుర్తుపట్టడం కోసం ఆతృతగా దృష్టిసారించాడు శేఖర్.

ఈసారి మగాళ్ళు కూడా నెత్తిన కుండల్తో చిందేసుకుంటూ వచ్చి, ఆడ వాళ్ళని కలవడాన్ని, నాగన్న గొంతెత్తి పెద్దగా ఏదో అనగానే ఆడా, మగా తమ నెత్తిమీది కుండల్ని ఒకరికొకరు మార్చుకోవడాన్ని ఎంతో ఆసక్తిగా తిలకించాడతను. వెంటనే మ్రోగిన డప్పు శబ్దంతో ఆడామగా కలిసి వేసిన చిందులో ఏదో విశేషత కనిపించిందతనికి.

ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే నాగన్న శేఖర్ దగ్గర కొచ్చి నిలబడి మళ్ళీ గట్టిగా కేకేసి, అందర్నీ దగ్గరకి రమ్మనడంతో ఈసారి జట్లుజట్లుగా వచ్చి నిలబడ్డారు వాళ్ళందరూ.

దగ్గరగా వచ్చిన వాళ్ళని శేఖర్‌కి పరిచయం చేస్తూ నాగన్న "ఈడు బక్కోడు ఈడి పెళ్ళం రంగి, ఈడు పోలిగాడు ఈడి పెళ్ళం వొరాలు, ఇదిగో దొరా! ఈడ్ని గుర్తుపట్టావా? పోలిగాడు. మీకు పాలు పోసేవాడు..."

ముఖానికి పసరు రాసుకుని ఒళ్ళంతా రంగులు పూసుకున్న అతన్ని గుర్తుపట్టడం సాధ్యంకాలేదు శేఖర్‌కి.

"ఈడేమో సూరీడు ఇది సీతాలు, ఈడు గారయ్య ఈడి పక్కనుంది సీతాలు, ఈడు రాందాసు ఇది డోలి, ఈడు ఆశయ్య..." అని చెప్పుకుంటూ పోతుండగా "డోలీ"అని వినపడ్డంతో శేఖర్ "ఆగాగు!" అంటూ డోలీ వంక చూసి ఆశ్చర్యపోయాడు.

"మన డోలీనేనా?..." మరింత ఆశ్చర్యంగా అడిగాడు ఆమె వేషధారణ చూసి.

"ఔ దొరా! నా బిడ్డే. సివరికి డోలీనే గుర్తుపట్టలేకపొయ్యారే?..." అని చిన్నగా నవ్వి "దీన్ని మనువాడినోడు రాందాసు" అనడంతో బిత్తరపోయాడు శేఖర్.

"మనువాడ్డమేంటి?..." అనడిగాడు వెంటనే కంగారుగా.

"అదే దొరా! ముందు ఆడోళ్ళ నెత్తిమీద కుండల్ని మొగోళ్ళు మార్చుకున్నారా? ఆ తరవాత మొగోళ్ళ కుండల్ని ఆడోళ్ళు మార్చుకున్నారా? అట్టా మార్చేసుకుంటే మనువైపోయినట్టే..."

నెత్తిన పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాడు శేఖర్ ఒక్కసారిగా.

నీలాకాశానికి ఎదిగిన తన ఆశలమీద నీళ్ళు చల్లినట్లవ్వడంతో తీవ్ర ప్రకంపనకు గురయ్యాడు. పచ్చని చెట్టు ఫలాలు అందుకునే సమయంలో ఆ చెట్టు మాడి మసైపోయినంత బాధపడ్డాడు. ఎవరికోసమైతే తను ఇన్ని సంవత్సరాలుగా ఈ మహాకార్యం నిర్వహించాడో, ఏమాశించి తన సంకల్ప ఫలాలు నలుగురికీ అందాలని ఆరాటపడ్డాడో ఆ ఆశయం మరొకరి సొత్తు కావడంతో నీరుగారిపోయాడు.

అంతకంటే ముఖ్యంగా నాగరికత తన దగ్గర నేర్చుకున్నా, తమ సంప్రదాయానికీ ఆమె విలువివ్వడం ఎంతో సంభ్రమానికి గురిచేసిందతన్ని.

దుఃఖంతో గొంతు పూడుకుపోగా "డోలీకి పెళ్ళని నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు నాగన్నా?..." అనడిగాడు.

"మా ఆశారం సెప్పనియ్యదు బాబూ! ఎవురికి నచ్చినోళ్ళని ఆళ్ళు సేస్కోడమే మా ఆశారం..."అన్న అతని సమాధానంతో తాను ఇక అక్కడ ఒక్క క్షణమున్నా తన మనసుపై అది చూపించే ప్రభావాన్ని తట్టుకోలేనని భావించి లేచాడు.

చివరిచూపుగా డోలీ వంక చూసాడు.

తను మొట్టమొదటిసారి చూసినప్పుడు ఎలా ఉందో అంతే నిర్మలంగా ఉందామె వదనం.

ఎంత చదువుకున్నా తమ గూడెం మనిషినే చేసుకోవాల్సొచ్చిందే అన్న అపరాధ భావనేం కన్పించలేదామెలో.

నిండు ముత్తయిదువలా మరింత శోభతో కొత్త చిగురులూ కళకళ లాడుతుందామె.

"అడవినుంచి బహుమతిగా నిన్ను మా ఇంటికి తీసుకెళ్దామనుకున్నాను డోలీ! కానీ నీ జ్ఞాపకాలను మాత్రమే తీసుకెళ్ళగలుగుతున్నాను. గాడ్ బ్లెస్ యూ!..."అన్నాననే అనుకుని అడుగులేసాడు.

వీడ్కోలు పలుకుతూ అతనితోపాటు అడుగులేసింది నిండు జాబిల్లి వెన్నెల.

★★★

"ప్రతిఫలాన్ని ఆశించి సాధించిన లక్ష్యానికి ప్రశంసలా? నిష్కల్మషమైన ప్రేమను ఆశించి నేనా మహాయజ్ఞాన్ని నిర్వహించాను తప్ప బాధ్యతగా కాదు. అటువంటప్పుడు నేనా అవార్డుని తీసుకోవడం న్యాయమేనా? నువ్వే చెప్పు..." అన్నాడు గతంలో నుంచి బైటికొస్తూ శేఖర్.

"అది ప్రేమ చిహ్నమేగానీ నా కర్తవ్యానికి కార్యరూపం కాదు. ఆమె పట్ల నా ప్రేమ నా లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆమె నాకు అనిర్వచనీయమైన స్ఫూర్తినిచ్చింది. నిజానికి ఆ అవార్డు దక్కాల్సింది ఆమెకే గానీ నాకు కాదు..." అన్న మిత్రుడి నిజాయితీకి "హేట్సాఫ్" అనకుండా ఉండలేకపొయ్యాడు చంద్రం.

"నిస్వార్థంగా చేసే సేవే నిజమైన సేవ!..." అంటూ మొక్కలకి నీళ్ళు పొయ్యడానికి ఉద్యుక్తుడైన శేఖరంత ఉత్తమంగా తాము కూడా ఎదగాలని ఆశిస్తూ ఆ లాన్‌లోని ప్రతి మొక్క ఎంతో ఆప్యాయంగా అతన్ని ఆశీర్వదిస్తున్నట్లనిపించిందతనికి, అవి చిరుగాలికి లయబద్ధంగా చేస్తున్న కదలికలు చూసి.

★